22042024-MAI-10_Layout 1 4/22/2024 1:26 AM Page 1






# సిబిల్ స్కోర్ పెరిగేదెలా?

## ఈ వ్యూహాలపై ఓ కన్నేయండి

**31** ఏండ్ల ఆశిష్ మెహ్రా తన సిబిల్ స్కోర్ కేవలం 590గానే ఉన్నట్టు ఇటీవల గుర్తించాడు. ఈ క్రెడిట్ స్కోర్ ఆధారంగానే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ఎవరికైనా రుణాలిస్తాయని, వడ్డీరేట్లను నిర్ణయిస్తాయన్నది తెలిసిందే. దీంతో తన క్రెడిట్ స్కోర్‌ను పెంచుకునేందుకున్న అన్ని మార్గాలను అన్వేషించాడు. ఈ క్రమంలో అనేక సలహాలు, సూచనలు నిపుణుల నుంచి అందుకున్నాడు. అలాగే దీర్ఘకాలంలో సిబిల్ స్కోర్ పెరగడానికి ఆర్థికపరంగా బాధ్యతాయుతమైన అలవాట్లు, క్రమశిక్షణ అవసరమని గ్రహించాడు. అయితే ప్రధానంగా ఆరు వ్యూహాలతో సిబిల్ స్కోర్‌ను బలోపేతం చేసుకోవచ్చని తేలింది. వాటిలో..

### సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్ పెరగడానికైనా, తగ్గడానికైనా మీరు తీసుకున్న అప్పులకు సంబంధించి చేస్తున్న చెల్లింపుల తీరే ప్రధానం. సకాలంలో లోన్ పేమెంట్స్ ఉన్నట్టైతే క్రెడిట్ స్కోర్ బాగుంటుంది. ఆలస్యమైతే తగ్గుతుంది. అలాగే అనవసరంగా లోన్ గ్యారంటీలకు వెళ్లకపోవడమే మంచిది.

### తక్కువ రుణ భారం

అపరిమితంగా ఉండే రుణ భారం కూడా క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుంది. కాబట్టి అనవసరంగా అప్పులు చేయవద్దు. అవసరమైతే తప్ప రుణాల కోసం బ్యాంకుల్లో విచారణలూ చేయకపోవడం ఉత్తమం.

### క్రెడిట్ నివేదిక తనిఖీ


మీ క్రెడిట్ స్కోర్‌ను తరచూ చెక్ చేసుకోవాలి. దీనివల్ల మీ రుణదాతలు చేసిన పొరబాట్లను గుర్తించి, సరిచేసుకోవచ్చు. రుణదాతలిచ్చే సమాచారం ప్రకారమే సిబిల్ స్కోర్ పెరగడం, తగ్గడం ఉంటుంది. కొన్నిసార్లు మన క్రెడిట్ స్కోర్‌ను అప్‌డేట్ చేయడం బ్యాంకర్లు మర్చిపోతారు. రుణాల చెల్లింపు వివరాలు సిబిల్‌కు ఇవ్వకపోవడం వల్ల నష్టపోతాం. ఆన్‌లైన్‌లో ఉచితంగానే క్రెడిట్ స్కోర్‌ను తెలుసుకోవచ్చు.



### క్రెడిట్ మిక్స్

మీరు ఏయే రుణాలను తీసుకుంటున్నారనేదానిపైన కూడా మీ సిబిల్ స్కోర్ ఆధారపడి ఉంటుంది. వాటిని ఎంత బాధ్యతాయుతంగా చెల్లిస్తున్నారన్నది కీలకంగా ఉంటుంది. కనుక వాహన, గృహ, వ్యక్తిగత, విద్య, క్రెడిట్ కార్డు, గృహోపకరణాల రుణాల నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ)ను మరువద్దు.

### ఈ 5 అంశాలు సిబిల్ స్కోర్‌ను ఏ స్థాయిలో ప్రభావితం చేస్తున్నాయో చూడండి




# పసిడి రుణాలపై తక్కువ వడ్డీ

**ఆపత్కాలంలో** ఆదుకునేది బంగారం మాత్రమే. అందుకే ఇటీవల కాలంలో పసిడిని తాకట్టు పెట్టి రుణాలు తీసుకునేవారు గణనీయంగా పెరుగుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు మొదలుకొని ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలు కూడా పుత్తడి తనఖాపై విరివిగా రుణాలు ఇస్తున్నాయి. వైద్య ఖర్చులు, ఇతర అత్యవసరాల్లో ప్రజలు గోల్డ్ లోన్లు తీసుకుంటున్నారు. ఫలితంగా ఆయా సంస్థల వ్యాపారం భారీగా వృద్ధిని నమోదు చేసుకుంటున్నది. ఇక సాధారణ రుణాలతో పోల్చితే సులువుగా, తక్కువ వడ్డీకే వస్తున్నాయి. ఆయా సంస్థలు ఎంత వడ్డీకి రుణాలు ఇస్తున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

### వడ్డీరేట్ల తీరిలా..

| బ్యాంక్ | వడ్డీరేటు (%) |
|---|---|
| కొటక్ మహీంద్రా | 8–24 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 8.50–17.30 |
| సెంట్రల్ బ్యాంక్ | 8.45–8.55 |
| యూకో బ్యాంక్ | 8.50 |
| యూనియన్ బ్యాంక్ | 8.65–9.90 |
| ఎస్బీఐ | 8.70 |
| బంధన్ బ్యాంక్ | 8.75–19.25 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 9.15 |
| పీఎన్‌బీ | 9.25 |
| కెనరా బ్యాంక్ | 9.60 |

### కావాల్సిన డాక్యుమెంట్లు

- రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు
- ఫోటోతో కూడిన గుర్తింపు పత్రం (డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/ఆధార్ కార్డ్/రేషన్ కార్డ్)
- అడ్రస్ ప్రూఫ్
- బ్యాంక్ ఖాతా వివరాలు




# ఆటుపోట్లకు ఆస్కారం

**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే మూటగట్టుకున్నాయి. రికార్డు గరిష్ఠాల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేశారు. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,156. 57 పాయింట్లు లేదా 1.55 శాతం కోల్పోయి 73,088.33 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ 372.4 పాయింట్లు లేదా 1.65 శాతం పడిపోయి 22,147 వద్ద నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణలవైపే మొగ్గు చూపవచ్చన్న అంచనాలున్నాయి. అయితే కొంత మేర కొనుగోళ్లకూ దిగవచ్చన్న అభిప్రాయాలున్నాయి. దీంతో ఆటుపోట్లకు ఆస్కారం ఉందని చెప్పవచ్చు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, వివిధ అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం మార్కెట్ తీరును నిర్దేశించనున్నాయి. ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం, చమురు మార్కెట్ తీరుతెన్నులు ఎక్కువగా ప్రభావితం చేయవచ్చన్న విశ్లేషణలున్నాయి. ఇక నిఫ్టీకి 22,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 21,700 మద్దతు స్థాయిగా చెప్పుకోవచ్చని మెజారిటీ నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 22,400-22,600 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చు.

# హోమ్‌లోన్‌పై టాప్-అప్‌కెళ్తారా?

**గృహ** రుణగ్రహీతలకు టాప్-అప్ లోన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇన్‌స్టంట్‌గా, ఈజీగా లభిస్తాయివి. తక్కువ వడ్డీరేటుతో, సులభ వాయిదా చెల్లింపుల పద్ధతితో, సౌకర్యవంతంగా ఉండే ఈ రుణాలు.. హోమ్ లోన్ సెగ్మెంట్‌లో ఎంతో పాపులర్.

### టాప్-అప్ లోన్స్ అంటే?

మీరు ఇప్పటికే ఓ గృహ రుణం తీసుకున్నారనుకుందాం. నాలుగైదేండ్లు, అంతకుమించో ఈఎంఐ చెల్లిస్తున్నారు. అయితే మీ ట్రాక్ రికార్డ్ బాగుంటే మీకు రుణాలిచ్చిన సంస్థలు వెంటపడిమరీ టాప్-అప్ లోన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాయి. మొబైల్ ఫోన్ రీచార్జ్ చేసుకున్నప్పుడు ఏదైనా ఆఫర్ లేదా సర్వీస్ కోసం టాప్-అప్ రిచార్జ్ చేసుకున్నట్టే ఇదికూడా. ఇప్పటికే ఉన్న గృహ రుణంపై అదనంగా మరో రుణం ఇవ్వడమే టాప్-అప్ లోన్. ఇంటి రినోవేషన్ లేదా కొత్త ఫర్నీచర్ కొనుగోలు, పెయింటింగ్ చేసుకోవడం, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ వంటివాటి కోసం ఈ టాప్-అప్ లోన్లకు వెళ్లవచ్చు. దీనికి ప్రత్యేకంగా మరో ఖాతా మొదలవుతుంది. దాని ఈఎంఐ కూడా వేరేగానే ఉంటుంది.




### ఎంత రుణం లభిస్తుంది?

ఉదాహరణకు మీరు 15 ఏండ్ల కాలపరిమితితో రూ.30 లక్షల గృహ రుణం తీసుకున్నారనుకుందాం. ఐదేండ్లలో ఈఎంఐల ద్వారా రూ.8 లక్షలు చెల్లించారని లెక్కిద్దాం. ఇప్పుడు మీ లోన్ గడువు ఇంకా పదేండ్లుంది. దీంతో ఇప్పటికే చెల్లించిన రూ.8 లక్షలను మళ్లీ పదేండ్లకుగాను టాప్-అప్ లోన్‌గా రుణదాతలు ఇవ్వవచ్చు. అలాగే పెరిగిన మీ ఆదాయాన్ని బట్టి కూడా టాప్-అప్ లోన్‌ను ఇంకా ఎక్కువే తీసుకోవచ్చు. కానీ మీ వయసుకు లోబడే రుణ కాలపరిమితి ఉంటుంది. అంతేగాక మీ రుణదాత పాలసీ, మీ వ్యక్తిగత స్తోమతనుబట్టి ఎన్నిసార్లైనా ఈ టాప్-అప్ లోన్లు తీసుకోవచ్చు.

### వడ్డీరేటు ఎంత?

ఇప్పుడున్న హౌజింగ్ లోన్‌పై పడుతున్న వడ్డీనే దీనికీ వర్తింపజేస్తారు. తక్కువ వడ్డీరేటు కావడం వల్లే చాలామంది వీటికి ఆకర్షితులవుతున్నారు. పర్సనల్ లోన్స్, క్రెడిట్ కార్డ్ రుణాలకు బదులు వీటిని ఎంపిక చేసుకుంటున్నారు. ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా ఉండటం మరొక కలిసొచ్చే అంశం. గరిష్ఠంగా రూ.30,000 వరకు ఉంటుంది. కాగా, ఇప్పటికే ఉన్న కస్టమర్ కాబట్టి రుణదాతలు కూడా టాప్-అప్ లోన్లను త్వరితగతినే మంజూరు చేస్తారు. పెద్దగా డాక్యుమెంట్లతో పని ఉండదు. నిధుల వినియోగంపైనా ఆంక్షలుండవు. గృహ రుణంలో మాదిరిగానే నగదు ఉన్నప్పుడు ఈ టాప్-అప్ లోన్‌నూ ముందుగానే తీర్చేయవచ్చు. పైగా ఇటీవలికాలంలో ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం వచ్చింది. క్రెడిట్ కార్డ్ తరహాలో వాడుకున్న నగదుకు మాత్రమే వడ్డీ చెల్లింపుల్ని చేసుకోవచ్చు.

### చివరగా..

టాప్-అప్ లోన్లను వీలున్నంత తొందరగా తీర్చేసుకుంటే రుణ భారం తగ్గుతుంది. అలాగే దీర్ఘకాలం వడ్డీ భారాన్ని తప్పించుకోవచ్చు. అవసరం ఉన్నంత మేరకే అప్పు తీసుకోవడం ఎంతైనా ఉత్తమం.

-నాగేంద్రసాయి కుందవరం

చిత్రం

# హైదరాబాద్‌లో గేమ్‌చేంజర్ హంగామా



రాజకీయం, నమ్మక ద్రోహం, అనుబంధం, సామాజికస్పృహ.. ఈ నాలుగింటితో మిళితమైన పొలిటికల్ థ్రిల్లర్ 'గేమ్‌చేంజర్'. దర్శకుడు ఎస్.శంకర్ తెరకెక్కించిన జెంటిల్‌మేన్, భారతీయుడు, ఒకేఒక్కడు, అపరిచితుడు చిత్రాల్లో ఉండే సామాజిక చైతన్యం ఇందులో కూడా ఉంటుందని తెలుస్తున్నది. రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో అంజలి, కైరా అద్వానీ కథానాయికలు. శ్రీకాంత్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. సోమవారం నుండి ఈ సినిమా చివరి షెడ్యూల్ హైదరాబాద్‌లో మొదలుకానున్నట్టు సమాచారం. రామ్‌చరణ్, ఎస్‌జె సూర్య, నవీన్‌చంద్రలతో పాటు మరికొందరు ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నట్టు తెలుస్తున్నది. కథానుగుణంగా కీలకమైన సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు శంకర్. భారీ అంచనాలున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో విడుదల కానుంది. సునీల్, సముద్రఖని ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: తమన్.

# సినిమా చూశాక బాధ అనిపించింది



మాజీ ప్రపంచసుందరి మానుషి చిల్లర్ తన తాజా చిత్రం 'బడే మియా చోటే మియా' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నది. ఇందులో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'కొన్ని పరిస్థితులు గొప్ప అకాశాలను కూడా వదులుకునేలా చేస్తాయి. నిజానికి సందీప్‌రెడ్డి వంగా 'కబీర్‌సింగ్'లో నేనే చేయాలి. అప్పుడు నేను మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకొని ఫెస్టివల్ మూడ్‌లో ఉన్నాను. ఆ సమయంలో 'కబీర్‌సింగ్' కాల్ వచ్చింది. పూర్తి వివరాలు తెలుసుకోకుండానే 'నో' చెప్పేశాను. ఆ తర్వాత తెలిసింది. అది షాహిద్‌కపూర్ సినిమా అని. చాలా బాధ పడ్డాను. సినిమా చూశాక ఇంకా బాధ అనిపించింది. సందీప్‌రెడ్డి వంగా గ్రేట్ డైరెక్టర్. ఆయన అభిమానిని అయిపోయాను. సందీప్ సినిమాలో చాన్స్ వస్తే మాత్రం వదులుకోను.' అంటూ చెప్పుకొచ్చింది మానుషి. ఇంకా చెబుతూ ' 'యానిమల్' ఎక్స్‌లెంట్ మూవీ. అందులో రష్మిక చేసిన గీతాంజలి కేరక్టర్ నన్ను కొన్ని రోజులపాటు హంట్ చేసింది. ఆ పాత్రను సందీప్ అద్భుతంగా డిజైన్ చేశారు. కుటుంబంలో కలతలు వచ్చినప్పుడు గీతాంజలి ధైర్యంగా నిలబడిన తీరు సూపర్. రష్మికలోని గొప్ప నటిని ఆవిష్కరించిన సినిమా 'యానిమల్'. కెరీర్‌లో అలాంటి పాత్రలు చేయాలని ఉంది' అంటూ తన కోరికను వ్యక్తం చేసింది మానుషి చిల్లర్.



# ఎవరీ అవధూత?

'కల్కి 2898 ఏడీ' ఏ తరహా సినిమా? ఇందులో ప్రభాస్, కమల్ హాసన్, అమితాబ్‌ల పాత్రలు ఏంటి? సినిమా మొదలైన నాటి నుంచి నేటి వరకూ ఈ ప్రశ్నలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇక సోషల్ మీడియాలో అయితే ఈ సినిమా కథ గురించి ఎవరికి తోచింది వాళ్లు రాసుకుంటూ ఉన్నారు. నిజానికి దర్శకుడు నాగశ్విన్ ప్రేక్షకుల ఊహలకు అందని స్థాయిలో ఈ కథను రాసుకున్నాడని సమాచారం. ప్రభాస్, వైజయంతీ మూవీస్ కెరీర్‌లోనే అత్యంత గ్రాండియర్‌గా ఉండే సినిమా 'కల్కి 2898 ఏడీ' అని ఫిల్మ్‌నగర్ టాక్. ఇది శ్రీమద్భాగవతం చెప్పిన భవిష్యత్ పురాణానికి దృశ్యరూపం అని సమాచారం. కథానుగుణంగా ఇందులో అమితాబ్ వయసు వేల సంవత్సరాలు ఉంటుందని తెలుస్తున్నది. అందుకు తగ్గట్టుగానే, మాసిన వస్త్రాలతో, నిర్జీవమైన శరీరంతో... వేల సంవత్సరాల భువన వైభవాలకూ, క్షామాలకూ సాక్షిగా కనిపిస్తాడట అమితాబ్. ఆదివారం విడుదలైన గ్లింప్స్ అందుకు అద్దం పట్టింది. ఇందులో ఆయన కారణజన్ముడిగా దర్శనమిచ్చాడు. ఓ క్షణకాలంపాటు యంగ్ అమితాబ్ ఈ గ్లింప్స్‌లో సాక్షాత్కరించడం విశేషం. ఈ గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయని చెప్పక తప్పదు.

# కాంతార 2లో మోహన్‌లాల్?



'కేజీఎఫ్' తర్వాత కన్నడ సినిమా ఖ్యాతిని మరింత పెంచిన సినిమా 'కాంతార'. ఏమాత్రం అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమా దర్శకుడు, హీరో, నిర్మాత అయిన రిషబ్‌శెట్టి ప్రస్తుతం 'కాంతార 2' తీసే పనిలో ఉన్నారు. ఇది 'కాంతార'కు సీక్వెల్ కాదు.. ప్రీక్వెల్. 'కాంతార'కు ముందు జరిగిన కథ అనమాట. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రిషబ్‌శెట్టి తెరకెక్కించనున్న ఈ చిత్రంలో కొందరు స్టార్లు కూడా భాగం కానున్నట్టు తెలుస్తున్నది. వీరిలో బలంగా వినిపిస్తున్న పేరు మోహన్‌లాల్. ఇటీవలే మోహన్‌లాల్‌ని రిషబ్ కలిశారు. ఆ ఫొటోను రిషబ్ షోషల్ మీడియాలో షేర్ చేయడంతో 'కాంతార 2'లో మోహన్‌లాల్ చేస్తున్నారన్న అనుమానాలకు బలం చేకూరినట్టయ్యింది. అలాగే.. ఇంకొందరు స్టార్ హీరోలు కూడా ఇందులో నటించనున్నారట. ఇది 'కాంతార'కు ముందు జరిగిన కథ కావడంచేత, కథ డిమాండ్ మేరకు గుర్రపు స్వారీతో పాటు కొన్ని యుద్ధవిద్యల్లో కూడా రిషబ్‌శెట్టి శిక్షణ తీసుకున్నారు. తన సొంత గ్రామంలో ఓ పెద్ద సెట్ వేసి, నాలుగు షెడ్యూల్స్‌లో ఈ సినిమాను రిషబ్ పూర్తి చేస్తారని సమాచారం. ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా ఓ కొలుక్కి వచ్చాయట.

# అందరికీ కనెక్టయ్యే సినిమా 'శబరి'



'సినిమాకు ఎమోషన్సే ప్రాణం. కథకీ, కథలోని ఎమోషన్స్‌కీ ఆడియన్ కనెక్టయితే.. ఆ విజయాన్ని ఎవరూ ఆపలేరు. ఈ కథకు ఉన్న బలం కూడా అదే. ఇది తల్లీకూతుళ్ల కథ. ఎంత బాగా చెబితే, అంతబాగా కనెక్టయ్యే పాయింట్.' అన్నారు నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల. ఆయన నిర్మించిన చిత్రం 'శబరి'. వరలక్ష్మీ శరత్‌కుమార్ టైటిల్‌రోల్ చేశారు. అనిల్ కాట్జ్ దర్శకుడు. తెలుగుతోపాటు హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు మహేంద్రనాథ్. 'నిర్మాత గురించి ఆలోచించే గొప్ప సంస్కారం ఉన్న వరలక్ష్మీ శరత్‌కుమార్ నా తొలి చిత్ర కథానాయిక కావడం ఆనందంగా ఉంది. ఈ కథను నాకంటే ముందు ఆమే ఓకే చేశారు. ఆమె అభిరుచిపై నాకున్న నమ్మకం నన్ను నిర్మాతను చేసింది' అని చెప్పారు మహేంద్రనాథ్. అమెరికాలో ఉద్యోగంలో చేరిన వారానికే వ్యాపారం మొదలుపెట్టాననీ, సినిమా చేయాలి అనుకున్నప్పుడు 5 భాషల్లో చేద్దామంటే ఓకే చెప్పాననీ, రిస్క్ తీసుకోకపోతే లైఫ్‌లో ఎదగలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందులో కథలో భాగంగానే ఎమోషన్సూ యాక్షన్ సీక్వెన్సూ ఉంటాయని, వరలక్ష్మీ ఎంతో కష్టపడి నటించారని ఆయన చెప్పారు. వరుణ్‌సందేశ్ హీరోగా తన రెండో సినిమా, బిగ్‌బాస్ అమర్‌దీప్, సురేఖవాణి కుమార్తె సుప్రీత జంటగా తన మూడో సినిమా ఉంటాయని మహేంద్రనాథ్ తెలిపారు.

# భిన్న మనస్తత్వాల ప్రయాణం



అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రలుగా రూపొందిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకుడు. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మాతలు. ఈ చిత్రం టీజర్‌ని శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ ఈవెంట్‌కి దర్శకుడు అజయ్ భూపతి అతిథిగా హాజరై యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. ఇది సినిమాగా అనిపించే జీవితమని, కథే ఇందులో హీరో అని, తాము పాత్రలం మాత్రమేనని అజయ్‌ఘోష్ అన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు కనెక్టయ్యే సినిమా ఇదని, భిన్న మనస్తత్వాలున్న ఇద్దరి ప్రయాణమే ఈ సినిమా కథ అని చాందినీ చౌదరి చెప్పారు. సహకరించిన నిర్మాతలకు దర్శకుడు శివ పాలడుగు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా నిర్మాతతో పాటు, యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

# నింద.. కాండ్రకోట మిస్టరీ



వరుణ్‌సందేశ్ నటించిన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' ఉపశీర్షిక. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. కథ, కథనం కూడా ఆయనే. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ఓ ఊరి వాతావరణం.. అక్కడ అలముకున్న చీకటి.. గుడిసె.. కత్తి పట్టుకున్న ఓ వ్యక్తి.. దుర్మార్గులను అంతం చేసేందుకు ఖడ్గంతో సిద్ధంగా ఉన్న న్యాయదేవత విగ్రహం.. ఇవన్నీ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఏదో కథ చెబుతున్నట్టుగా ఈ పోస్టర్ ఉందని పోస్టర్ చూసిన పలువురు సినీ ప్రముఖులు అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రంలో ఆనీ కథానాయిక. తనికెళ్ల భరణి, ఛత్రపతి శేఖర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రమీజ్ నవీత్, సంగీతం: సంతు ఓంకార్.

